క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదవాలి



కాతేరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: పాఠశాల తొలి రోజు నుంచి ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు తప్పకుండా వస్తాయని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవ రావు అన్నారు. కాతేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. కొత్త తరగతుల్లోకి మారిన విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. ఉన్నత లక్ష్యాలతో చదువును ప్రారంభించాలని, ఏ రోజు పాఠాలు ఆరోజు ప్రణాళికాబద్ధంగా చదివితే ఒత్తిడి ఉండదని, మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. హెచ్‌ఎం దేవా అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో విశేష పూజలు

కడియం: మండలంలోని వీరవరంలో ఉన్న నాగమ్మతల్లి ఆలయం ప్రతిష్ఠాపనా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధన జరిగింది. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇరిగేషన్ సమస్యలపై ఎస్‌ఈకి వినతి



ఎస్‌ఈని సత్కరిస్తున్న ఈశ్వరరావు

కడియం: ఆవ కాలువ, కడియం లాకుల సమస్యలను పరిష్కరించాలని ధవళేశ్వరం ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.గోపీనాథ్‌రెడ్డికి నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ధవళేశ్వరంలో ఎస్‌ఈని కలిసిన ఆయన ఆయా సమస్యలను వివరించారు. ప్రధాన లాకు, క్యారీ కాల్వ, కఠ్ర కాల్వ చెక్‌డాం తలుపులు పాడయ్యాయని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. వీటికి మరమ్మతులు చేయకపోతే వర్షాకాలంలో ముంపు సమస్య ఏర్పడుతుందని ఎస్‌ఈ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై అంచనాలు రూపొందించారని, తక్షణం పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యలను పరిశీలిస్తానని ఎస్‌ఈ చెప్పారు. రైతు నాయకుడు గారపాటి తాతబ్బాయి పాల్గొన్నారు.

29 నుంచి ఉచిత శిక్షణా శిబిరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి కంబాలచెరువు వద్ద ఉన్న టౌన్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో వేసవి ఉచిత శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పిల్లల్లో జ్ఞానాన్ని, ఊహాశక్తిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు కె.భీమయ్య, ఎం.మల్లికార్జునరావు, వై.ఫైడియ్య, చెక్క తాతారావు, కె.కృష్ణసాయి, బీవీఎల్ఎన్ ఆనందబాబు, జి.తాతారావు, సీహెచ్ శ్రీరాములు తదితరులు వివిధ అంశాలలో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు టౌన్ మున్సిపల్ హైస్కూల్‌లో లేదా 99491 35822 నంబర్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడాలి



స్మార్ట్ ఇండో అమెరికన్ పాఠశాలలో వరల్డ్ ఎర్త్ డే సంబరాలు

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే కట్టుబడి ఉండాలని స్మార్ట్ ఇండో అమెరికన్ పాఠశాల డైరెక్టర్లు బి.హరనాథ్, బి.లావణ్య పిలుపునిచ్చారు. మంగళవారం వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా పాఠశాలలో పలు రకాల సంభాషణలు, చార్ట్ ద్వారా విద్యార్థులకు భూమి ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. భూమిని కాపాడుకోవాలంటే ఏ కార్యక్రమాలు చేపట్టాలో పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు వివరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ ఎస్.కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ జేఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

కడియం: మండలంలోని వీరవరం పాఠశాలకు దాత రూ.16 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. మంగళవారం స్కూల్ హెచ్‌ఎం వి.సుజాత అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సౌండ్ సిస్టంను అందించారు. జనసేన నాయకుడు ఆదిమూలం సాయిబాబా తన తండ్రి శ్రీరాములు జ్ఞాపకార్థం దీనిని సమకూర్చారు. ఎంఈఓ మణికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డేగ కన్ను

- వివాదాస్పద ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా
- బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు డ్రోన్‌తో చెక్
- నేరాల అదుపునకు పోలీసుల వినూత్న పంథా



డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ పొందుతున్న పోలీస్ సిబ్బంది (ఫైల్)


రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల కాలంలో మద్యం, గంజాయి, దారిదోపిడీలు, చైన్ స్నాచింగ్ కేసులు తీవ్రమయ్యాయి. ప్రతిఘటించే బాధితుల పైనా అసాంఘిక శక్తులు దాడులకు వెనుకాడటం లేదు. కొన్ని ప్రాంతాల్లో రాజకీయ, వ్యక్తిగత కారణాలతో తరచూ వివాదాలు నెలకొంటున్నాయి. మహనీయుల విగ్రహాలపై దాడులతో చెలరేగుతున్న విద్వేషాల నేపథ్యంలో సర్వత్రా ఆందోళనను వ్యక్తమవుతుంది. వీటన్నింటికీ అదుపు చేసేందుకు పోలీసులు వినూత్న పంథాను అనుసరిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, వివాదాస్పద ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఆకతాయిల ఆట కట్టించేందుకు సరికొత్తగా డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలు, వినియోగంలో లేని లేఅవుట్లలో జరుగుతున్న చీకటి కార్యకలాపాలకు చెక్ పెడుతున్నారు.

పెరుగుతున్న మత్తు వినియోగం

గతంలో పోల్చితే రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో మద్యంతో పాటు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నాయనడంలో సందేహం లేదు. మద్యం బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. గంజాయి అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు ఇటీవలి కాలంలో వెలుగు చూసిన పలు ఘటనలే నిదర్శనం. దీంతో యువత మద్యపానంతో పాటు, గంజాయి బారిన పడుతుండడం ఆందోళన కలిగించే విషయం. నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు, పార్కులు, జనావాసాల సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశాలను ఎంచుకుని.. మద్యపానం, గంజాయిని వినియోగిస్తున్నట్టు స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ మత్తులోనే పలువురు దారుణాలకు ఒడిగడుతున్నారు.

సాంకేతికతతో ఆటకట్టు

ఇటీవల కాలంలో రెచ్చిపోతున్న ఆకతాయిలకు చెక్ పెట్టేందుకు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆధ్వర్యంలో గత జనవరి నుంచి మొదలు పెట్టినా డ్రోన్ ప్రయోగం సత్ఫలితాలు ఇస్తున్నాయి. రోజూ ఓ ప్రదేశాన్ని ఎంచుకుని, ఆ ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో రికార్డు చేస్తున్నారు. అలా బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఇట్టే గుర్తించి, క్షణాల్లో నిరోధించేందుకు అవకాశం ఏర్పడుతోంది. జనవరి నుంచి ఇప్పటివరకు 67 సార్లు డ్రోన్ వినియోగం జరిగింది. గోదావరి లంకల్లో సారా తయారీదారుల ఆటకట్టించడం ఇందులో భాగమే. డ్రోన్లపై పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చైన్ స్నాచింగ్, ఇతర నేరాలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు ఇతరుల సీసీ కెమెరాలపై ఆధారపడకుండా.. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను నెలకొల్పారు.



డ్రోన్ కెమెరాతో రికార్డు చేసిన పుష్కర ఘాట్ ప్రాంతం

నేరాల నియంత్రణకు చర్యలు



ఇకపై సాంకేతికతతో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకు వినూత్న చర్యలు తీసుకుంటున్నాం. నేర నియంత్రణే లక్ష్యంగా క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుంది. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాం. నేరాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రదేశాలైన పాడుబడిన ఇళ్లు, తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు, గోదావరి నదీతీరాల వెంబడి డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశాం. దీనికోసం సిబ్బందికి డ్రోన్ ఆపరేటింగ్‌పై ప్రత్యేక శిక్షణ నిర్వహించాం.

– డి.నరసింహ కిషోర్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి ఎం.జగదీశ్వరి గుంటూరు ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం నాలుగో అడిషనల్ సివిల్‌జడ్జి పి.సాయిసుధ మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్‌జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో విశాఖజిల్లా యలమంచిలి అడిషనల్ సివిల్ జడ్జి టి.వీరరాఘవేంద్రను బదిలీచేశారు.

చెత్త ప్రాంతాలను గ్రీన్ స్పాట్లుగా మార్చాలి


కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో రోడ్లపై చెత్త వేసే ప్రాంతాలను గ్రీన్ స్పాట్లుగా మార్చాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, వారి పరిధిలో సమస్యలను పరిష్కరించాలని నిర్దేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలో దోమల వ్యాప్తి అరికట్టేందుకు ప్రతి డివిజన్‌లో నిత్యం దోమల మందు స్ప్రేయింగ్ కొనసాగించాలన్నారు. నగరాన్ని చెత్త కుండీ రహితంగా రూపొందించినప్పటికీ, ఇంకనూ కొన్నిచోట్ల ప్రజలు రోడ్లపై చెత్త వేయడం విచారకరమన్నారు. అటువంటి ప్రాంతాలను గుర్తించి, అక్కడ చెత్త వేయకుండా గ్రీన్ స్పాట్లుగా మార్చాలని నిర్దేశించారు. రాబోయే వర్షాకాలంలో నీరు నిలవకుండా డ్రైన్లలో పూడికలు తీసే కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. వర్షపు నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. నగరంలోని ప్రతి తోపుడు బండి, షాపుల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌ఓ డా.ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం



శ్రీషిర్డీసాయిలో విద్యార్థుల ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థులు

కడియం: ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీషిర్డీసాయి విద్యా నికేతన్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భూమి గొప్పదనాన్ని, కాలుష్యాన్ని నివారించే మార్గాలను, భూమిని ఎలా కాపాడుకోవాలి తదితర అంశాలపై విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించారు. భూమిని చేతులతో కాపాడుతున్నట్లు విద్యార్థులు నిలబడిన ఆకృతి ఆకట్టుకుంది.

రాజమహేంద్రవరం రూరల్: కవలగొయ్యి రోడ్‌లోని దిఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ధరిత్రీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వ్యాస రచన, క్విజ్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పుడమి తల్లిని కాపాడుకోవాలని, వాతావరణ కాలుష్య నివారణకు చెట్లను పెంచాలంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

కమ్యూనిజమే ఏకైక మార్గం

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కమ్యూనిజమే ఏకైక మార్గమని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ అన్నారు. మంగళవారం బొమ్మూరు వెంకటగిరికొండపై ఉన్న ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సోషలిస్టు రాజ్య నిర్మాత, రష్యా విప్లవ రథసారథి కామ్రేడ్ లెనిన్ జయంతి, సీపీఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కోరాడ అప్పారావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కార్పొరేట్ల స్వార్థం కోసం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహించి, ఆదివాసీలను సమూలంగా నిర్మూలిస్తున్నట్టు ఆరోపించారు. ఈ ఆపరేషన్‌ను నిలిపివేయాలని, ఆదివాసీల ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.అప్పలరాజు, సీహెచ్ సతీష్, సీహెచ్ భద్రం, పీఓడబ్ల్యూ నాయకులు వెంకటలక్ష్మి, చవటయ్య నాయుడు, రమణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఫేర్‌వెల్



మెడల్స్ అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ తదితరులు

కడియం: వేమగిరి పంచాయతీలోని జక్కంపూడి నగర్ ప్రాథమిక పాఠశాలలో ఫేర్‌వెల్ మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ విద్యార్థులకు అకడమిక్ కేప్స్, మెడల్స్, షీల్డులు అందజేశారు. మహిళా కో–ఆర్డినేటర్ ఏరుకొండ రాజేశ్వరి సత్య సాయి సంస్థల ఎగ్జామ్ పాడ్లు పంపిణీ చేశారు. ఎంఈవో మణికుమార్, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఎస్‌ఎంసీ చైర్మన్ చల్లా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ లావాదేవీల నివేదిక సిద్ధం చేయాలి

భాస్కర్‌నగర్ సొసైటీ స్థలాలపై కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో భాస్కరనగర్ సొసైటీ స్థలాలకు సంబంధించిన రికార్డుల్ని సమగ్రంగా పరిశీలన చేస్తేనే, అది ఎవరిదన్న విషయం నిర్ధారణ అవుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భాస్కర్‌నగర్ సొసైటీ స్థలాలపై కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, హై లెవెల్ కమిటీ సభ్యులు ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ఎం.జనార్దనరెడ్డి, డీఎస్పీ, రాజమహేంద్రవరం సిటీప్లానర్, లిపి లిక్విడేటర్ చంద్రశేఖర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భాస్కర్‌నగర్ సొసైటీ స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిబంధనలు పాటించకుండా, రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణల నేపథ్యంలో సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. ఇందులో భాగంగా స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇందుకు కార్పొరేషన్ కమిషనర్ సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. లిక్విడేటర్ చంద్రశేఖర్ వివరణ ఇస్తూ, తను 2020 నుంచి లిక్విడేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు, ఓ డాక్యుమెంట్ మాత్రమే లీగల్ ఒపీనియన్ తీసుకుని, నిజ నిర్ధారణ చేసుకుని రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ, గతంలో లిక్విడేటర్ చేసిన వ్యక్తి కొన్ని రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. అందుకు సంబంధించి ఎటువంటి అధికారాలు లేకపోయినా, రిజిస్ట్రేషన్లు చేశారని చెప్పారు. భాస్కర్‌నగర్ సొసైటీలోని స్థలాలను కేటగిరీ వారీగా గుర్తించి, తగిన రికార్డులు సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే వాణిజ్య విలువలు కలిగిన కార్నర్ బిట్లు పూర్తి స్థాయిలో సహకార శాఖ ఆధీనంలో ఉన్న స్థలాలన్నారు. నిబంధనలు పాటించకుండా రిజిస్ట్రేషన్ చేసిన వాటిని గుర్తించి, వాటిపై సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నల్ల బెల్లం వ్యాపారి అరెస్టు

- 17,919 కిలోల నల్లబెల్లం స్వాధీనం
- గోడౌన్ సీజ్ చేసిన అధికారులు



నిందితుడు, సరకును చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: సారా తయారీకి నల్ల బెల్లం సరఫరా చేస్తున్న బెల్లం వ్యాపారి గ్రంధి వీరభద్రరావును ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. అతని వద్ద 17,919 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకుని, గోడౌన్ సీజ్ చేసినట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య మంగళవారం వెల్లడించారు. ఆమె వివరాల మేరకు, సోమవారం కోలమూరు గ్రామంలో సారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులలో బి.నరసింహస్వామిగౌడ్‌ను అరెస్టు చేసి, 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అతడికి సారా తయారీ కోసం గ్రంధి వీరభద్రరావు నల్లం బెల్లం సరఫరా చేస్తున్నాడని తెలపడంతో, రాజమండ్రిలోని ఎస్‌వీజీ మార్కెట్‌లో ఉన్న వీరభద్రరావు గోడౌన్‌పై దాడులు నిర్వహించారు.

246 కేసులు నమోదు

రాజమహేంద్రవరం రూరల్, నగర ప్రాంతాల్లో ఎక్కడా సారా వ్యాపారం జరగరాదని, అలా చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి లావణ్య హెచ్చరించారు. సారా తయారీకి నల్ల బెల్లం అమ్మే వర్తకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సారా కేసుల్లో ఉన్నవారిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. మూడు, అంతకంటే ఎక్కువ కేసులు నమోదైన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచించామన్నారు. నవోదయం 2.0లో భాగంగా ఇప్పటివరకు 246 కేసులు నమోదు చేసి, 210 మందిని అరెస్టు చేసినట్టు వివరించారు. 4,458 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 1,06,970 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. 22,149 కిలోల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆర్థిక బలోపేతానికి చేతివృత్తులు దోహదం



జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న సెబిన్ జేమ్స్

రాజమహేంద్రవరం సిటీ: మహిళల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి, తద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని బెంగళూరు చెందిన డిజైనర్ పెయింటెడ్ ప్రింట్స్ అధినేత సెబిన్ జేమ్స్ అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన కుట్టు శిక్షణ 77వ బ్యాచ్ ముగింపు ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఉత్తీర్ణత పత్రాల పంపిణీలో 27 మందికి ఆయన జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలను చేతివృత్తుల ద్వారా ఆర్థిక శక్తిగా మార్చవచ్చన్నారు. తమ సంస్థ ద్వారా అనేక మంది టైలరింగ్, మగ్గం నిపుణులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళల స్వయం వృద్ధి కోసం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. సంస్థ ముఖ్య నిర్వాహకులు జి.రాంబాబు మాట్లాడుతూ 78వ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు లాలాచెరువులోని తమ సంస్థలో స్వయంగా సంప్రదించాలని కోరారు.

‘నన్నయ’లో నీడ గడియారం ఏర్పాటు



నీడ గడియారాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో సమయాన్ని తెలియజేసే చాళుక్య ద్వారం వద్ద ఉన్న సన్ డయల్ (నీడ గడియారం)ని మంగళవారం వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. పూర్వీకులు సమయాన్ని నీడ ద్వారానే తెలుసుకునేవారన్నారు. దీనిని నీడ గడియారం లేదా పలభా యంత్రం అని కూడా పిలుస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్నవరం, ద్రాక్షారామలో ఈ గడియారం ఉందని, తర్వాత నన్నయ విద్యార్థులే దీనిని ఏర్పాటు చేశారన్నారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సూర్య గమనంతో ఈ యంత్రంపై పడే నీడ ద్వారా సమయాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఫిజిక్స్ అధ్యాపకులు వి.రాజశేఖర్, బయో టెక్నాలజీ అధ్యాపకులు ఎస్.మురళీమోహన్ సహకారంతో విద్యార్థులు బి.శ్యామలాదేవి, పి.కావ్య తనుశ్రీరెడ్డి, కె.బిందుప్రియ, ఎస్.దుర్గా భవాని, కె.జయప్రశాంత్ ఈ నీడ గడియారాన్ని తయారుచేశారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా కృషి చేయాలి: కలెక్టర్



అపరాల పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కడియం: భవిష్యత్తు తరాలకు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యం కోసం ప్రతి రైతు తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. మంగళవారం కడియం మండలం మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, లాభసాటిగా ఉండేలా సూచనలు ఇస్తోందన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఉద్యానాధికారి సుజాత, మండల అధికారులు, తదితరులు ఉన్నారు.

అగ్ని బాధితులకు సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న తాడాల

కడియం: మండలంలోని బుర్రిలంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు టీవీసీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తాడాల విష్ణు చక్రవర్తి మంగళవారం సాయం అందజేశారు. ట్రస్టు తరపున బియ్యం, రూ.పదివేలు ఆర్థిక సాయం అందించారు.

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న దానవాయిపేటలో క్రిస్టల్ స్పా సెంటర్‌పై సోమవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ స్పాసెంటర్‌లో బ్యూటీషియన్ కోర్సులు నేర్పిస్తామని యువతులకు ఎర వేస్తున్నారు. ఇలా చేరిన యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. వన్‌టౌన్ ఎస్సై ఆదినారాయణకు వచ్చిన సమాచారం మేరకు, సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి స్పా సెంటర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు యువతులు, ఇద్దరు విటులు పట్టుబడ్డారు. అక్కడ రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకుని, స్పా నిర్వాహకుడు మదన్, మేనేజర్ తేజశ్రీ, రిసెప్షనిస్ట్ రాజును అరెస్టు చేశారు. ఎస్సై ఆదినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కడియం: వేమగిరి శివారు కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.20 లక్షలు, పంచాయతీ నిధులు రూ.30 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మంగళవారం శంకుస్థాపన చేశారు. బుద్ధ విహార్‌ను సుందరీకరణ చేసేందుకు నిర్వాహకులు యార్లగడ్డ జగదీశ్వరరావుకు రూ.25 వేల విరాళాన్ని అందించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, డీఈ రవి, ఎంపీడీవో రమేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదలకు చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో 13 మంది పేదలకు రూ.13.76 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఇవి ఉపయోగపడతాయన్నారు. ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, మాజీ కార్పొరేటర్ రాయుడు సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కోసం బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ మంగళవారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ అంతరాయం కలుగుతుందన్నారు. రిలయన్స్ స్మార్ట్ ఏరియా, బ్రదరన్ చర్చి, నాగరాజు స్కూల్, గిరిజన కార్పొరేషన్, చెరుకూరి వారి ఏరియా, విద్యానగర్, వీవర్స్‌కాలనీ, రావి చెట్టు సెంటర్, చర్చి ఆఫ్ గాడ్, గణేష్ నగర్, పీఅండ్‌టీ కాలనీ, పోస్టాఫీస్ రోడ్, జయకృష్ణపురం, వీరభద్రపురం, లలితానగర్, హరిపురం, బోధి స్కూల్, ముద్రగడ ఏరియాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

సినిమాలు

శ్యామల	గుడ్ బ్యాడ్ అగ్లీ
సూర్యమినీ	జాట్
సూర్యప్యాలెస్	జాక్
స్వామి	ఓదెల–2
శివజ్యోతి	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
అనుశ్రీ	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
రాజా	ఓదెల–2
ఊర్వశి	మ్యాడ్‌స్క్వేర్
మేనక	మధురం, డియర్ ఉమ
రంభ	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
కుమారి	ఓదెల–2
అప్సర	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
అశోక	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
నామవరం	
వీఎస్ మహల్	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
కడియం	
వెంకటసూర్య	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి